సాక్షి తిరుపతి

శనివారం । 11 । మార్చి । 2023



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.57,470
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,133

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.63,700
రిటైల్ వెండి గ్రాము	రూ.65.70

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	34	18
చిత్తూరు	34	19
తిరుమల	29	14
గూడూరు	34	21
నగరి	36	20



ఘనంగా లక్ష కుంకుమార్చన ప్రారంభం

తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో అమ్మవారి లక్ష కుంకుమార్చన శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఆదివారం సంప్రోక్షణతో లక్ష కుంకుమార్చన పరిసమాప్తం కానుంది. - II లో



ఆత్మీయ సభకు తరలివచ్చిన అశేష జనం



మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి

చెవిరెడ్డితో చంద్రగిరికి స్వర్ణయుగం

- కష్టకాలంలో వెన్నంటి ఉండే వ్యక్తి
- టీడీపీ పాలనంతా ఆయనకు వేధింపులే
- వైఎస్సార్‌సీపీ లోక్‌సభ పక్షనేత, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి
- నియోజకవర్గ ప్రజల కోసం ఎందాకైనా : ఎమ్మెల్యే చెవిరెడ్డి

తిరుపతి రూరల్/చంద్రగిరి: నియోజకవర్గ ప్రజల కోసం తపించే చెవిరెడ్డి లాంటి నాయకుడు అరుదుగా ఉంటారని, ఆయన ఎమ్మెల్యేగా ఉన్న కాలం అభివృద్ధిలో చంద్రగిరికి స్వర్ణయుగమని వైఎస్సార్ సీపీ లోక్‌సభ పక్షనాయకుడు, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి కొనియాడారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో చంద్రగిరి సమీపంలోని తొండవాడ వద్ద శుక్రవారం జరిగిన ఆత్మీయ సభ విజయవంతమైంది. ఈ భారీ బహిరంగ సభకు దాదాపు 50 వేల మందికిపైగా తరలిరావడంతో తొండవాడకు వచ్చే దారులన్నీ కిక్కిరిసిపోయాయి. అంతకుముందు తిరుపతి రూరల్ మండలం చెర్లోపల్లి సర్కిల్ నుంచి చంద్రగిరి మీదుగా తొండవాడ సభా ప్రాంగణం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. మిథున్‌రెడ్డి, చెవిరెడ్డికి క్రేన్ ద్వారా గజమాలతో స్వాగతం పలికారు. సభావేదిక వద్ద ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం సభలో ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గంలో రూ.430 కోట్లతో అభివృద్ధిని చేపట్టడం ఓ రికార్డు అన్నారు. కష్టకాలంలో వెన్నంటి ఉండే వ్యక్తి అని, ఆయన అంటే తమకు ఎంతో ఇష్టమన్నారు. గత టీడీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఆయనకు అన్నీ కష్టాలేనన్నారు. చెవిరెడ్డి రాక ముందు చంద్రగిరి ఎలా ఉంది, ఆయన వచ్చాక ఎలా ఉందనేది ప్రజలు గుర్తిస్తున్నారని చెప్పారు.

పథకాలను ఆపేస్తారంట

విద్యాదీవెన, వసతి దీవెన, అమ్మ ఒడి వంటి పథకాలను ఆపివేస్తామని లోకేష్ చెప్పడం వారి వెన్నుపోటు సంస్కృతికి నిదర్శనమని ఎంపీ మండిపడ్డారు. తాము అధికారంలోకి వస్తే అన్నీ ఆపేస్తామని చెప్పడమే తప్ప ప్రజలకు మేలు చేస్తామని చెప్పే పరిస్థితి లేదన్నారు.


పేర్నాటిని గెలిపించుకుందాం

రానున్న పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎన్నికల్లో జగన్నకు నమ్మిన బంటు, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించుకుందామని ఎంపీ పిలుపునిచ్చారు. పట్టభద్రులందరూ నైపుణ్యత కలిగిన వారని, భవిష్యత్తును చూసి ఓటు వేయాలని కోరారు. చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యాంప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రీజనల్ కో–ఆర్డినేటర్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పాల్గొన్నారు.



గజమాలతో నేతలకు స్వాగతం పలుకుతున్న అభిమానులు

నా కుటుంబం ఎంతో.. నా ప్రజలు అంతే!



'ప్రజా క్షేత్రంలో ఉండేందుకు ఎంతో ఇష్ట పడతా. చంద్రగిరి నియోజకవర్గ ప్రజలను సైతం నా కుటుంబం లాగే భావిస్తా. నేను సంపాదించే ప్రతి రుపాయిలో 75 శాతం ప్రజలకే ఖర్చు చేస్తా'నని ప్రభుత్వ విప్, తుడా చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. కరోనా కష్టకాలంలోనూ సొంత నిధులతో గడపగడపకు వెళ్లి వారిని ఆదుకున్నట్లు చెప్పారు. రూ.430 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. ఎన్నికల సమయంలో మాటలు చెప్పే వ్యక్తి మీ చెవిరెడ్డి కాదన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి పంచాయతీలో ఒక కల్యాణ మండపం, యోగా ధ్యాన మందిరం, కర్మక్రియల భవనం, గ్రామాల్లో సుమారు 250 ఆర్‌ఓ వాటర్‌ప్లాంట్లను కట్టించానని తెలిపారు. 430 రచ్చ బండలు, పోలీసు స్టేషన్, తహసీల్దార్, ఆసుపత్రి, ఎంపీడీఓ కార్యాలయాల్లో రిసెప్షన్లు కట్టించినట్టు వెల్లడించారు. నియోజకవర్గంలో 1150 సీసీ రోడ్లు, 340 బీటీ రోడ్లు, 115 మెటల్ రోడ్లుతో సుమారు 1,500 రోడ్లు ఒక్క చంద్రగిరిలో వేయించానని చెప్పారు. ఆపద వస్తే పారిపోయే వ్యక్తిని కాదన్నారు. తనపై ఎన్ని విమర్శలు చేసినా వారి విజ్ఞతకే వదిలేస్తానన్నారు.

విమర్శలు పట్టించుకోం.. అభివృద్ధే లక్ష్యం



చంద్రగిరి నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కృషిచేస్తున్నారని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రీజనల్ కో–ఆర్డినేటర్ మోహిత్‌రెడ్డి తెలిపారు. విమర్శలను పట్టించుకోమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలకు అతీతంగా ప్రభుత్వ పథకాలను అందించేందుకు జగనన్న సైనికుల్లా పనిచేస్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రజా సేవే పరమావధిగా చిత్తశుద్ధితో కృషిచేస్తున్నామని చెప్పారు. జనం కోసమే మనం అనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు.

న్యూస్‌రీల్

దొంగ ఓట్లు వేస్తే కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

తిరుపతి అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో దొంగ ఓట్లు వేయడానికి ప్రయత్నించినా కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల నేతలతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారులతోపాటు ఓటర్లు ఎన్నికల నియావళి ప్రకారం నడుచుకోవాలన్నారు. ఓటరు స్లిప్‌తోపాటు ఐడీ కార్డు ఉండాలని చెప్పారు. 13న పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులు చిత్తూరు స్ట్రాంగ్ రూమ్‌కు తరలించాలన్నారు. ఒకే ఇంటి నంబర్‌తో పలు ఓటర్లు ఉన్నారని, ఆ మేరకు పరిశీలించి ఓటరు స్లిప్‌లు పంపిణీ చేశామని తెలిపారు. దొంగ ఓట్ల నియంత్రణ, కేసుల నమోదుకు చర్యలు చేపట్టనున్నట్టు వెల్లడించారు.

కోదండరాముడికి వెండి చామరాలు వితరణ



రెండు వెండి చామరాలు అందజేస్తున్న దాతలు

తిరుపతి కల్చరల్: తిరుపతికి చెందిన వుంకటేశ్వరయ్య, ఉదయలక్ష్మి దంపతులు శుక్రవారం రూ.1.2 లక్షల విలువ చేసే రెండు వెండి చామరాలు కోదండరాముడికి వితరణ చేశారు. వాటిని ఆలయ డెప్యూటీ ఈఓ నాగరత్నకు అందజేశారు. ఆలయ అర్చకులు ఆనంద కుమార దీక్షితులు పాల్గొన్నారు.

కారిడార్ రోడ్డుకు భూసేకరణ



భూసేకరణపై సర్వే చేస్తున్న అధికారులు

నాయుడుపేట: నాయుడుపేట మండల పరిధిలోని విశాఖపట్నం– చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం రైజెస్ సంస్థ భూసేకరణపై సర్వే నిర్వహించింది. రోడ్లు–భవనాలశాఖ సౌజన్యంతో రోడ్డు విస్తరణ, అభివృద్ధికి ఏడీబీ నిధులు కేటాయించినట్టు ఆ సంస్థ ఎక్స్‌పర్ట్ పీ దేవరాజు తెలిపారు. ఇందులో భాగంగా 9 కిలో మీటర్లు పొడవు, 22.5 మీటర్లు వెడల్పుతో రెండు వైపులా 45 మీటర్ల మేర 4 లేన్ల రహదారికి భూసేకరణ చేస్తున్నామన్నారు. తిమ్మాజికండ్రిగ నుంచి నేషనల్ హైవే -5 వరకు నాలుగు లేన్ల రోడ్డు నిర్మించనున్నట్టు వెల్లడించారు. ఆర్‌అండ్‌బీ ఎల్‌ఏ ఆర్‌ఆర్ అసిస్టెంట్ ఉదయ్‌శంకర్, రామయ్య, నాగార్జున, రమణయ్య, రత్నం పాల్గొన్నారు.

పోలేరమ్మకు వెండి కిరీటం వితరణ



వెండి కిరీటాన్ని అందుకుంటున్న ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్, ఈఓ

చిల్లకూరు: తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ ఆలయ అనుబంధంగా ఉండే పోలేరమ్మ తల్లికి దాతలు 1.228 కిలోల వెండి కిరీటాన్ని వితరణగా అందించారు. ఈ మేరకు శుక్రవారం ముత్యాలమ్మ ఆలయంలో మాజీ ట్రస్టు బోర్డు చైర్మన్ వేమారెడ్డి మురళీమోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఈఓ నవీన్‌కుమార్‌కు అందించారు. ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు పోలేరమ్మ జాతర నేపథ్యంలో దాతలు వెండికిరీటాన్ని అందించినట్టు తెలిపారు.

పోలింగ్ కేంద్రాలున్న పాఠశాలలకు సెలవు

- రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరినారాయణన్

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల పరిధిలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహించే విద్యా సంస్థలకు సెలవు ఉంటుందని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరినారాయణన్ శుక్రవారం ప్రకటించారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పోలింగ్ నిర్వహించే ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు సోమవారం సెలవు ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

సర్వే ఆధారంగా వైద్యసేవలుండాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: వైద్యవిభాగం చేపట్టిన సర్వే ఆధారంగా వైద్యసేవలుండాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన అధికారులతో సమావేశమై పలు సూచనలు, సలహాలు అందించారు. పట్టణ, రూరల్ ప్రాంతాల్లో రోగాలు, వాటి నివారణకు సంబంధించి చేపట్టిన సర్వే ఆధారంగా వైద్యం అందించాలన్నారు. రోగనిరోధకశక్తిని పెంచుకునేలా ఫ్యామిలీ డాక్టర్లు అవగాహన కల్పించాలని చెప్పారు. బడిబయట పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యం 1వ తరగతి సీట్ల ఖాళీల వివరాలను ఆన్‌లైన్ పోర్టల్లో ఈనెల 16వ తేదీలోపు నమోదు చేయాలన్నారు. డీసీహెచ్‌ఎస్ ప్రభావతి, మహిళాశిశు సంక్షేమ జిల్లా అధికారి జయలక్ష్మి, ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధికారి చెన్నయ్య, డీఎల్‌డీఓ సుశీలాదేవి పాల్గొన్నారు.

ఇక్కడ చదవడం పూర్వజన్మ సుకృతం

- ఘనంగా శ్రీపద్మావతి మహిళా పాలిటెక్నిక్ కళాశాల వార్షికోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న జేఈఓ సదాభార్గవి

తిరుపతి అలిపిరి: శ్రీ వేంకటేశ్వర స్వామివారి పాదాల చెంతగల టీటీడీ కళాశాలల్లో చదవడం విద్యార్థినుల పూర్వజన్మ సుకృతమని జేఈఓ సదాభార్గవి తెలిపారు. తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా పాలిటెక్నిక్ కళాశాల 47వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారని, పట్టుదలతో శ్రమిస్తే అనుకున్న స్థాయికి చేరుకోవచ్చని చెప్పారు. విద్యార్థినులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, క్రమశిక్షణతో నడచుకుని చక్కగా చదువుకోవాలని సూచించారు. ఈ కళాశాలలో నిర్వహిస్తున్న డీఈసీఈ, డీ.ఫార్మసీ గ్రూపులకు నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ) గుర్తింపు లభించడం హర్షణీయమన్నారు. టీటీడీ విద్యాశాఖ అధికారి డా.ఎం.భాస్కర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డా.జి.అసుంత, ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాల పూర్వ ప్రిన్సిపల్ ఎం.మునిరత్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న డీఆర్వో శ్రీనివాసరావు

తిరుపతి అర్బన్: జిల్లాలో ఈనెల 15వ తేదీ నుంచి జరగనున్న ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని డీఆర్వో శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమయ్యారు. ఇంటర్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 73 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా, 58,750 మంది విద్యార్థులు హాజరుకానున్నట్టు వెల్లడించారు. ఈనెల 15 నుంచి ఏప్రిల్ 04 వరకు ఇంటర్ పరీక్షలు ఉంటాయన్నారు. ఈ మేరకు ఏర్పాట్లపై ఆర్ఐఓ వీ.రమేష్‌కు పలు సూచనలు చేశారు. సమావేశంలో ఒకేషనల్ ఎడ్యుకేషన్ అధికారి స్వర్ణలత, డీఈఓ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పప్పూ.. పోటీకి, చర్చకు సిద్ధమా?

- నీది నాది చిత్తూరు జిల్లానే
- చిత్తూరు డీఎన్‌ఏ, రక్తం నీలో ఉంటే రా?
- ఈనెల 12న తంబళ్లపల్లెలో ఉంటాను
- అభివృద్ధిపై చర్చకు సిద్ధమేనా?
- లోకేష్‌కు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి సవాల్!



మాట్లాడుతున్న ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి

సాక్షి, తిరుపతి: 'వెన్నుపోటుదారుడు చంద్రబాబు కొడుకా.. తెలుగు రాష్ట్ర ప్రజలు పిలిచే పప్పూ.. చిత్తూరు జిల్లాలో అభివృద్ధిపై ఎప్పుడైనా ఎక్కడైనా చర్చకు సిద్ధం. అదేవిధంగా చిత్తూరు జిల్లాలో ఎక్కడైనా పోటీకి సిద్ధం. నీలో చిత్తూరు డీఎన్‌ఏ, రక్తం ఉంటే రా?' అంటూ లోకేష్‌కు పార్లమెంట్ ప్యానల్ స్పీకర్, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి సవాల్ విసిరారు. తిరుపతిలోని తన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితో కలిసి ఎంపీ విలేకరుల సమావేశం నిర్వహించారు. అన్నమయ్య జిల్లాలో పాదయాత్ర చేస్తున్న లోకేష్ ప్రభుత్వంపైనా, తనపైన విమర్శలు చేస్తూ... అభివృద్ధిపై సిద్ధమని పిలుపు ఇవ్వడంపై ఎంపీ మిథున్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. చిన్నాపెద్దా లేకుండా దుర్భాషలాడడం లోకేష్ అలవాటని, చిన్నవాడైనా గౌరవంగా మాట్లాడడం తనకు తల్లిదండ్రులు నేర్పిన సంస్కారమన్నారు. చిత్తూరు జిల్లా అభివృద్ధిపై తాను చర్చకు సిద్ధమని, ఈనెల 12న తంబళ్లపల్లిలోనే ఉంటానని చెప్పారు. పాదయాత్రలో లోకేష్ కూడా తంబళ్లపల్లిలోనే ఉన్నారని, ఆ రోజు ఎప్పుడు ఎక్కడికి పిలిచినా చర్చకు సిద్ధంగా ఉంటానని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో చిత్తూరు జిల్లా నుంచి లోకేష్‌కు ఎక్కడి నుంచైనా పోటీచేసే దమ్ముందా? అని ప్రశ్నించారు. లోకేష్ చిత్తూరు జిల్లా వాడేనని, తాను కూడా చిత్తూరు జిల్లా వాడేనని దమ్ముంటే.. చిత్తూరు డీఎన్‌ఏ, రక్తం ప్రవహిస్తుంటే పోటీకి సిద్ధమా? అని సవాల్ విసిరారు. జిల్లాలో ఎక్కడ నుంచి పోటీ చేయమని చెప్పినా వైఎస్సార్‌సీపీ నాయకులను ఎలాగైనా ఒప్పించి ఎన్నికల బరిలో నిలబడడానికి తాను సిద్ధమని స్పష్టం చేశారు. అదే లోకేష్ కూడా పోటీకి సిద్ధమా? అని ప్రశ్నించారు. తనపై పోటీచేసి గెలవమని సవాల్ విసిరారు. కుప్పం మున్సిపల్ ఎన్నికల్లో వంగివంగి దండాలు పెట్టి, దుర్భాషలాడి, జనాలను రెచ్చగొట్టారని, ప్రజల తీర్పుతో అసెంబ్లీకి రాకుండా చంద్రబాబు ముఖం చాటేశారని గుర్తుచేశారు. లోకేష్ సమాధానం కోసం వేచి చూస్తానని ఎంపీ మిథున్‌రెడ్డి వెల్లడించారు.

సీఐఎస్‌ఎఫ్‌కు ప్రపంచ స్థాయిలో గుర్తింపు

సూళ్లూరుపేట: కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్‌ఎఫ్) ప్రపంచ స్థాయిలో మేటి భద్రతా వ్యవస్థగా మారిందని, ఇందుకు సీఐఎస్‌ఎఫ్ అందుకున్న అవార్డులు, రివార్డులు, సేవా పతకాలే నిదర్శనమని సీనియర్ కమాండెంట్ రేఖా నంబియార్ తెలిపారు. కేంద్ర పారిశ్రామిక భద్రతాదళాలు 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని శ్రీహరికోట రాకెట్ కేంద్రంలోని స్పేస్ సెంట్రల్ స్కూల్ మైదానంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా సీనియర్ కమాండెంట్ రేఖా నంబియార్ ఆధ్వర్యంలో సీఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం భద్రతా దళాలు పరేడ్ నిర్వహించి సైనిక వందనాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో 354 కీలకమైన ప్రాంతాల్లో 1,64,000 లక్షల మంది సిబ్బందితో భద్రతకు సంబంధించిన విధుల్లో నిమగ్నమై ఉన్నామని తెలిపారు. ఎంతో కీలకమైన 65 విమానాశ్రయాలు, ఓడరేవులు, అణుకేంద్రాలు, అంతరిక్ష సంస్థలు, బొగ్గు, చమురు, ఉక్కు ఉత్పాదనా కేంద్రాలకు సీఐఎస్ఎఫ్ భద్రత నిర్వహిస్తోందని చెప్పారు. మెట్రోరైలు భద్రతా వ్యవస్థను కూడా సీఐఎస్ఎఫ్‌కే అప్పగించారని తెలిపారు.

ప్రణాళికాబద్ధంగా వేద విద్య అమలు

- వర్సిటీలో వేద, ఆగమ హెరిటేజ్ కారిడార్ల ఏర్పాటు
- దైవత్వం ఉట్టిపడేలా ప్రాంగణాన్ని తీర్చిదిద్దాలి
- టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి



అధికారులతో సమీక్షిస్తున్న టీటీడీ ఈవో ధర్మారెడ్డి

తిరుపతి అలిపిరి: తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో వచ్చే విద్యాసంవత్సరం నుంచి నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ–2020 ప్రకారం వేదవిద్యను ప్రణాళికాబద్ధంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో గల కార్యాలయంలో ఈఓ శుక్రవారం వేద వర్సిటీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ వేదవర్సిటీలో అడుగడుగునా దైవత్వం ఉట్టిపడేలా ప్రాంగణాన్ని తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వర్సిటీ ప్రాంగణంలో వేదిక్ హెరిటేజ్ కారిడార్, ఆగమ, పౌరోహిత్య హెరిటేజ్ కారిడార్లు ఏర్పాటుచేసి ఇందులో వేదాలు, ఆగమాలు, పౌరోహిత్యం తదితర విషయాలపై సమాచారాన్ని ప్రదర్శించేలా చర్యలు చేపట్టాలన్నారు. వర్సిటీ పచ్చదనం, పరిశుభ్రతతో అలరారే విధంగా అధ్యాపకులు, విద్యార్థులు నడుచుకోవాలని సూచించారు. హాస్టల్లో డైట్ ప్రకారం తయారుచేసే భోజనం పూర్తి నాణ్యతగా ఉండాలన్నారు. బ్రాడ్ కాస్టింగ్ ద్వారా నిత్యం వేదమంత్రాలు వినిపించేలా వర్సిటీ ప్రాంగణంలో తగిన ఏర్పాట్లు చేయాలని చెప్పారు. వేదాల రికార్డింగ్ కోసం వేద రికార్డింగ్ రూమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అందుబాటులో ఉన్న దాదాపు రెండు లక్షల పైచిలుకు రాతప్రతుల స్కానింగ్ పనులను ఎస్వీ మాన్యుస్క్రిప్ట్ ప్రాజెక్ట్ ద్వారా వేగవంతం చేయాలని చెప్పారు. ఈ సమీక్షలో టీటీడీ జేఈఓ సదాభార్గవి, ఉపకులపతి ఆచార్య రాణిసదాశివమూర్తి, రిజిస్ట్రార్ డా.రాధేశ్యామ్, ఈఈ మల్లికార్జున ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాహుకేతు పూజా టికెట్ల కౌంటర్లు ప్రారంభం



కౌంటర్లను ప్రారంభిస్తున్న ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తుల సౌకర్యార్థం నూతనంగా నిర్మించిన రూ.500, రూ.750 రాహుకేతు పూజ టిక్కెట్ల కౌంటర్లను శుక్రవారం పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ప్రారంభించారు. ఆలయ అర్చకులు విశేష పూజలు నిర్వహించిన అనంతరం ఈ కౌంటర్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, ఆలయ అధికారులు సతీష్‌మాలిక్, నాగభూషణంయాదవ్, హరియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సర్కిల్‌లోకి దూసుకెళ్లి ఆగిన కారు



ధ్వంసమైన కారు

సూళ్లూరుపేట: పట్టణంలోని హోలీక్రాస్ సర్కిల్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున షార్ ఉద్యోగులకు చెందిన కారు మలుపు తిరుగుతూ సర్కిల్‌లోకి దూసుకెళ్లి ఆగిపోయింది. అదృష్టవశాత్తు కారులో ఉన్న వారికి ఏమీ కాలేదు. చెన్నై నుంచి వస్తున్న కారును అతి వేగంగా మలుపు తిప్పడంతో అదుపు తప్పి సర్కిల్‌కు ఉన్న ఇనుప బారికేడ్‌ను ఢీకొని లోపలికి వెళ్లి ఆగిపోయింది.

ఘనంగా లక్ష కుంకుమార్చన ప్రారంభం



సింహ వాహనంపై అమ్మవారు



లక్ష కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో తలపెట్టిన అమ్మవారి లక్ష కుంకుమార్చన శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ప్రతి ఏటా మాఘ మాసంలో భక్తుల సౌకర్యార్థం మూడు రోజుల పాటు అమ్మవారి లక్ష కుంకుమార్చన నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణ చేపట్టారు. అనంతరం ఆలయ ఆవరణలో లక్ష కుంకుమార్చనను అర్చకులు వేద మంత్రోచ్చరణల నడుమ శాస్త్రోక్తంగా చేపట్టారు. ఉదయం 8 నుంచి రాత్రి 7 గంటల వరకు నాలుగు గ్రూపులుగా అర్చన పూజలో తొలి రోజు సుమారు 550 మంది భక్తులు పాల్గొన్నారు. వారికి అమ్మవారి కుంకుమ, గాజులు, పసుపు దారం, ప్రసాదాలు వితరణ చేశారు. శనివారం ఉదయం 8 నుంచి రాత్రి 7 గంటల వరకు విడతల వారీగా పూజలు నిర్వహించనున్నారు. ఆదివారం మధ్యాహ్నం సంప్రోక్షణతో లక్ష కుంకుమార్చన పరిసమాప్తం కానుంది. ఇందులో పాల్గొనే వారు రూ.801 చెల్లించి టికెట్ తీసుకోవాలని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈవో ఎం.మునిక్రిష్ణయ్య, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

మేలు జాతి లేగదూడల పోషణలో మెలకువలు అవసరం



లేగదూడలను పరిశీలిస్తున్న వైద్యులు

వెంకటగిరిరూరల్: పాడి పరిశ్రమలో మేలు జాతి లేగదూడలు పోషణలో మెళకువలు పాటించాల్సిన అవసరం ఉందని పశుసంవర్థక సహాయక సంచాలకులు డాక్టర్ ఎంవీ స్వామిబాబు తెలిపారు. మండలంలోని పారవోలు గ్రామంలో లేగదూడల ప్రదర్శన, సంరక్షణపై పాడి రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ కృత్రిమ గర్భధారణ ద్వారా రైతులు మేలైన జాతి పశువుల ఉత్పత్తి, లేగ దూడలను పెంపొందించుకోవచ్చునన్నారు. పాడి రైతులు పశువులు, లేగదూడల పోషణలపై జాగ్రత్తలు వహించాలని సూచించారు. జిల్లా పశుగణాభివృద్ధిసంఘం ఉప సంచాలకులు డాక్టర్ టి సోమయ్య మాట్లాడుతూ కృత్రిమ గర్భాధారణ కార్యక్రమంలో పేయ దూడలు మాత్రమే జన్మించేలా ప్రభుత్వం పశు వీర్యాన్ని సబ్సిడీ ద్వారా పాడి రైతులకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. పశువుల సంరక్షణకు ప్రభుత్వం అంబులెన్స్‌లను వినియోగిస్తుందని, ఏదైన సమస్య ఉంటే 1962కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు కుల్లూరు శ్రీదేవి, సర్పంచ్ అమ్ములు, వైద్యులు వసంతరాయులు, శేఖర్, కిషోర్, గ్రామస్తులు, పాడి రైతులు పాల్గొన్నారు.

కోర్టు వద్ద సొమ్మసిల్లి పడిపోయిన మహిళ

– మానవతాదృక్పథంతో బెంచ్ దిగివచ్చిన జడ్జి

తిరుపతి లీగల్ : తిరుపతి కోర్టు ఆవరణలోని మూడో అదనపు జిల్లా జడ్జి కోర్టు వద్ద శుక్రవారం కేసు వాయిదాకు వచ్చిన ఓ మహిళ సొమ్మసిల్లి పడిపోయారు. కోర్టులో ఉదయం 10.30 గంటలకు రోజువారీ కేసుల విచారణ ప్రారంభమైంది. మూడో అదనపు జిల్లా జడ్జి వై.వీర్రాజు కేసులను పరిశీలిస్తున్నారు. ఇంతలో అదే కోర్టుకు కక్షిదారుగా వచ్చిన ఒక మహిళ హఠాత్తుగా ప్రధాన ద్వారం వద్ద సొమ్మసిల్లి పడిపోయారు. గమనించిన జడ్జి వీర్రాజు వెంటనే బెంచ్ దిగి అక్కడికి చేరుకున్నారు. ఆమె కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి సహాయం అందించాలని కోర్టు సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఆటోలో ఆస్పత్రికి తరలించారు. ఆమె వెళ్లిన తర్వాత న్యాయమూర్తి తిరిగి విధులకు వచ్చారు. స్థానిక మూడో అదనపు జిల్లా జడ్జి చూపిన చొరవను కక్షిదారులు, న్యాయవాదులు కొనియాడారు. మూడో అదనపు జిల్లా జడ్జి కోర్టులోని ఓ ఎగ్జిక్యూషన్ పిటిషన్‌లో ఆమె ఫిర్యాదిగా ఉన్నట్టు తెలిసింది.

సూర్యప్రభపై అలఘునాథుడు



సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న అలఘునాథస్వామి

గూడూరు: పట్టణంలోని తూర్పువీధిలో ఉన్న అలఘునాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి, అమ్మవార్లు సూర్యప్రభ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు విశేషాలంకరణ చేసి, పూజ చేశారు. అనంతరం స్వామివారు సూర్యప్రభ వాహనంపై ఊరేగారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో శుక్రవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 24 కంపార్టుమెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 58,494 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 23,025 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.91 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టికెట్లు లేని వారికి 24 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు కలిగిన వారు 2 గంటల్లో స్వామిని దర్శనం చేసుకోగలుగుతున్నారు.

డేటా ఎంట్రీలో తప్పులు చేసిన వారిపై చర్యలు

తిరుపతి అర్బన్: ఓటర్ల విషయంలో డేటా ఎంట్రీలో తప్పులు చేసిన వారిపై చర్యలు తప్పవని కలెక్టర్ వెంకటరమణారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో మీడియాతో మాట్లాడారు. ఒకే అడ్రస్‌తో పలు ఓట్లు ఉన్నట్లు తేలిందని, వెంటనే వాటిని సవరణ చేస్తున్నట్లు వెల్లడించారు. బోగస్ సర్టిఫికెట్లతో నమోదైన ఓట్లను పరిశీలిస్తున్నట్టు తెలిపారు. చిన్నపాటి తప్పులు చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. మొత్తం 38 పోలింగ్ కేంద్రాలు ఉంటే వాటిలో 6 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఒకే అడ్రస్‌తో కొన్ని ఓట్లు ఉన్నట్లు తెలుస్తోందన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతి చెందిన శేఖర్

చంద్రగిరి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి ఎం.కొంగరవారిపల్లి వద్ద గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ఐరాలకు చెందిన శేఖర్(39) పశువుల మేత కోసం ఎండి గడ్డిని తీసుకురావడానికి గురువారం రాత్రి ట్రాక్టర్‌లో మరో వ్యక్తి వీరయ్యతో కలిసి శ్రీకాళహస్తికి బయల్దేరాడు. ఎం.కొంగరవారిపల్లి వద్ద వస్తున్న క్రమంలో వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ట్రాక్టర్‌ను ఢీకొంది. దీంతో ట్రాక్టరు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న కాలువలో పడడంతో తీవ్ర గాయాలపాలైన శేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. వీరయ్య క్షేమంగా బయటపడ్డారు. చంద్రగిరి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

సంక్షేమ రథసారథి సీఎం జగన్

- జాతీయ స్థాయిలో గుర్తింపు
- లోకేష్‌ది పాదయాత్ర కాదు విహారయాత్ర



తిరుమల ఆలయం వెలుపల మోపిదేవి వెంకటరమణ

తిరుమల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ రథసారథిగా జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ ప్రశంసించారు. ఆయన శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. ప్రతి పౌరుడు సుఖ సంతోషాలతో ఉండాలని ముఖ్యమంత్రి కోరుకుంటున్నారని తెలిపారు. పాదయాత్రలో అన్ని వర్గాల ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం అయ్యాక అమలు చేసిన వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. లక్షలాది మందికి ఉద్యోగావకాశం కల్పించిన వ్యక్తిగా ఆయన జనం గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతున్నారన్నారు. ఉనికి కాపాడుకోవడానికే చంద్రబాబుబాబు తనయుడు లోకేష్ పాదయాత్ర చేపట్టారని విమర్శించారు. లోకేష్‌ది పాదయాత్ర కాదు విహారయాత్ర అని వ్యాఖ్యానించారు. గతంలో చంద్రబాబు పాదయాత్ర చేసి ఏ ఒక్క సమస్య కూడా పరిష్కరించలేదని గుర్తుచేశారు. హామీలన్నీ తుంగలో తొక్కిన ఘనత టీడీపీకే దక్కిందన్నారు. టీడీపీ ఎన్నికల పోరులో దండాలు పెట్టినా.. ఏంచేసినా 2024లో గెలుపు మాత్రం వైఎస్సార్‌సీపీదే అని ధీమా వ్యక్తం చేశారు.

2024 ఎన్నికల్లో పోటీ చేస్తాం

- త్వరలో పార్టీని ప్రకటిస్తాం
- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర్రావు వెల్లడి



నివాళులు అర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర్రావు, సంఘ నేతలు

తిరుపతి కల్చరల్: బీసీలు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు ప్రాతినిధ్యం వహిస్తూ 2024 ఎన్నికల్లో పోటీచేస్తామని, ఈమేరకు త్వరలో పార్టీని ప్రకటించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర్రావు ప్రకటించారు. కపిలతీర్థం సమీపంలోని ఓ ప్రైవేటు హోటల్లో శుక్రవారం రాష్ట్రస్థాయి బీసీ నేతల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలోని బీసీలు, బహుజనులను సమైక్యం చేసే విషయంలో ఏపీ బీసీ సంక్షేమ సంఘం కృషి చేస్తోందన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలతో కలిసి ఏపీ బీసీ సంక్షేమ సంఘం ద్వారా కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు చేయడానికి రాష్ట్రంలోని 26 జిల్లాల్లో ఇప్పటికే కార్యకర్తలు, నాయకులను ఏర్పాటు చేసుకుని పటిష్టమైన పార్టీ నిర్మాణ దిశగా అడుగులేస్తున్నామని తెలిపారు. దీనికి ముందు ఆయన జ్యోతిబాయి పూలే వర్ధంతి సందర్భంగా నాయకులతో కలిసి ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి టి.సోమశేఖరాచారి, రాష్ట్ర నాయకులు క్రాంతికుమార్, రఘుపతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగదీష్, సురేంద్ర, సి.శంకర్, కె.సెంథిల్, కిరణ్, కిషోర్, వాసు, చంద్ర పాల్గొన్నారు.

ఊపందుకున్న ఆన్‌లైన్ ప్రచారం



వెంకటగిరి: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఆన్‌లైన్ ప్రచారం హోరెత్తుతోంది. అభ్యర్థులు వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్‌ల వేదికగా తమకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. అభ్యర్థుల మద్దతుదారులు సైతం ఆన్‌లైన్‌లో పెద్దఎత్తున పోస్టులు పెడుతున్నారు. తూర్పు రాయలసీమ పట్టభద్రుల శాసన మండలి స్థానం నుంచి మొత్తం 22 మంది, ఉపాధ్యాయ స్థానం నుంచి 8 మంది బరిలో ఉన్నారు. పట్టభద్రుల స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డితోపాటు టీడీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నుంచి కంచర్ల శ్రీకాంత్, బీజేపీ పట్టభద్రుల స్థానం నుంచి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానం నుంచి బ్రహ్మనందం, పీడీఎఫ్ తరపున ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా బాబురెడ్డి పొక్కిరెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీగా మీగడ వెంకటేశ్వరరెడ్డి బరిలో ఉన్నారు. ఈనెల 13న ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో వీరి మద్దతుదారులు ఆన్‌లైన్ వేదికగా ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఐవీఆర్ఎస్ ద్వారా అభ్యర్థుల వాయిస్‌తో ఓటర్లకు పంపి ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

గ్రామ కార్యదర్శిపై విచారణ



గ్రామ కార్యదర్శి సుబ్బారావును విచారిస్తున్న డీఎల్‌పీఓ వెంకటరమణ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గాజులపెళ్లూరు గ్రామ కార్యదర్శి ఎస్‌వీ సుబ్బారావు అవినీతి, అక్రమాలపై విచారణ ప్రారంభమైంది. గ్రామకార్యదర్శి ప్రభుత్వ సొమ్ము కాజేశాడని గ్రామస్తులతో పాటు మాజీ సర్పంచ్ రమణయ్య కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో శుక్రవారం గూడూరు డివిజనల్ పంచాయతీ అధికారి వెంకటరమణ, సిబ్బంది భువనేశ్వర్, వంశీ విచారణ చేపట్టారు. సుబ్బారావు అవినీతిపై గ్రామస్తులు, మాజీ సర్పంచ్ నుంచి వివరాలు సేకరించారు. అనంతరం డీఎల్‌పీఓ వెంకటరమణ మాట్లాడుతూ గ్రామ కార్యదర్శి ఎస్‌వీ సుబ్బారావు గతంలో వేసిన సీసీరోడ్డు పనికి సంబంధించి రూ.లక్ష 93 వేల 387 కాజేశారని, గ్రీన్ అంబాసిడర్ వద్ద కొంత డబ్బు వసూలు చేశాడని, పంచాయతీకి మంజూరైన ఏకగ్రీవ నిధులు రూ.7 లక్షలు కూడా స్వాహాచేశాడనే ఆరోపణలు ఎదుర్కొంటున్నట్టు తెలిపారు. దీనికి సంబంధించి 2021 జూన్ వరకే రికార్డులున్నాయని, విచారణలో వెలుగు చూసిన వాస్తవాలను కలెక్టరుకు నివేదించనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

రైలు నుంచి జారిపడి యువకుడికి గాయాలు



చికిత్స పొందుతున్న యువకుడు

గూడూరు: వెళుతున్న రైల్లోంచి జారి పడిన యువకుడికి గాయపడిన సంఘటన శుక్రవారం మనుబోలు వద్ద జరిగింది. రైల్వే పోలీసుల కథనం మేరకు.. ఒడిశా రాష్ట్రానికి చెందిన భోశా శంకర్ అనే యువకుడు చెన్నైలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో అతను తన స్వగ్రామానికి వెళ్లే క్రమంలో రైలులో చెన్నై నుంచి ఒడిశా రాష్ట్రానికి బయలుదేరాడు. రైలులో రద్దీ అధికంగా ఉండగా, శంకర్ డోరు వద్ద నిల్చున్నాడు. ఈ క్రమంలో రైలు గూడూరు జంక్షన్ దాటి మనుబోలు మండలం కొండూరు సత్రం సమీపంలో వెళుతుండగా శంకర్ జారి కిందపడిపోయాడు. దీంతో గాయపడిన అతడిని 108 సిబ్బంది గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ముత్యాలమ్మ ఆలయానికి రూ.7.21 లక్షల ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

చిల్లకూరు: తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ ఆలయానికి వేలం పాటల ద్వారా రూ.7.21 లక్షల ఆదాయం వచ్చినట్లు డీఎల్‌పీఓ వెంకటరమణ తెలిపారు. ఈ నెల 14 నుంచి 17 తేదీ వరకు నిర్వహించనున్న జాతర నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసుకునే తాత్కాలిక దుకాణాలకు సంబంధించిన తూర్పుకనుపూరు సచివాలయంలో శుక్రవారం సర్పంచ్ అన్నాడిశెట్టి నాగమ్మ ఆధ్వర్యంలో డీఎల్‌పీఓ వెంకటరమణ పర్యవేక్షణలో వేలం పాటల నిర్వహించారు. స్థలాలను దక్కించుకునేందుకు పాటదారులు అధిక సంఖ్యలో పోటీ పడ్డారు. ప్రసన్నలక్ష్మీ అనే మహిళ రూ.7.21 లక్షలకు హెచ్చు పాట పాడి, స్థలాల లీజు హక్కులను దక్కించుకున్నట్లు డీఎల్‌పీఓ వెంకటరమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ స్వర్ణ, ముత్యాలమ్మ ఆలయ ఈఓ నవీన్‌కుమార్, ఎస్ఐ గోపాల్, కార్యదర్శులు చంద్రశేఖర్, సాయిరామమ్మ, తదితరులు పాల్గొన్నారు.

దూసుకొచ్చిన మృత్యువు



మృతి చెందిన మునస్వామి

తడ: జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తడ మండలం, వాటంబేడు గ్రామానికి చెందిన కుప్పంపాటి మునస్వామి(33) మృతి చెందాడు. ఎస్ఐ జేపీ శ్రీనివాసరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. తడలోని ఓ ప్రైవేటు పరిశ్రమలో పని చేసే మునస్వామి విధులు ముగించుకుని మరో ఇద్దరు వ్యక్తులతో కలిసి బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. పరిశ్రమ నుంచి కొంత దూరం వెళ్లాక బీఎల్‌పాడు మలుపు వద్ద ముందు వెళుతున్న లారీ అకస్మాత్తుగా పక్కకు రావడంతో అదుపు తప్పి ముగ్గురూ కిందపడిపోయారు. అదే సమయంలో మునస్వామి లారీ చక్రాల కింద పడి మృతి చెందగా మిగిలిన ఇద్దరూ రోడ్డు పక్కకు పడిపోయారు. సమాచారం అందుకున్న ఎస్ఐ సంఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పోస్టుమార్టం నియమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.